అద్దంలో ముఖం చూసుకున్న అజయ్ అదిరి పడ్డాడు.

కారణం...

హారర్ సినిమాలోలాగా తన కనుగుడ్లు భయంకరంగా ముందుకు పొడుచుకువచ్చి, మతిపోగొడుతున్నాయి.

సోఫాలో కూర్చుని కారణాన్ని వెదకసాగాడు.

ఆరోజు ఉదయం పక్కమీదనుంచి లేస్తున్నప్పుడు అతడి ఎడమకన్ను అదిరింది. అప్పుడే అనుకున్నాడు... ఏదో కీడు జరగబోతోందని.

అరగంట ఆలోచించినా ఏమాత్రం బోధ పడలేదు. పని ఒత్తిడి కారణంగా జరిగిందేమో అనుకున్నా, నాలుగు సంవత్సరాలుగా హైటెక్ సిటీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అదీ ఓ టీమ్ లీడర్‌గా.

నైట్‌డ్యూటీలకు ఎప్పుడో అలవాటు పడిపోయాడు. అందుకని జాబ్‌పరంగా సమస్య తలెత్తడానికి అవకాశం ఏమాత్రం లేదు. కంపెనీ పనిమీద విజయవాడ వచ్చాడు. మరి ఏం జరిగినట్టు?!

వారానికి అయిదు రోజులే పని కావడంతో ఆ రోజు ఇంట్లోనే వుండిపోయాడు. మనసంతా వికలమైపోయింది. అలా నిస్త్రాణగా వెనక్కువాలాడు.

ఇంతా చేసి తనకు పాతికేళ్లు కూడా లేవు. ఇంతలో ఈ ఉపద్రవం ఏమిటో అర్థంకాలేదు. అంతలో మోగింది కాలింగ్ బెల్.

ఈ టైమ్‌లో ఎవరబ్బా అనుకుంటూ వెళ్లి తలుపు తీసాడు. ఎదురుగా స్నేహితుడు తరుణ్. ఎంతో రిలీఫ్‌గా అనిపించింది. కాలేజి రోజుల నుంచీ ఇద్దరూ బాగా క్లోజ్. ఒకరి విషయాలు మరొకరితో దాపరికం లేకుండా మాట్లాడుకునే చనువుంది. అప్పుడు ఎదురుగా వుండటంతో, మనసులో బాధ తన్నుకువచ్చి, అతణ్ణి వాటేసుకుని బావురుమన్నాడు. క్షణంపాటు తరుణ్‌కి ఏమీ అర్థంకాలేదు. ఎప్పుడూ ఎంతో నిబ్బరంగా, సరదాగా వుంటూ అందరికీ ధైర్యం చెప్పే స్నేహితుడు అలా బేలగా మారడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఛ... ఏంటిది చిన్న పిల్లాడిలా. అసలేం జరిగిందో చెప్పు" అడిగాడు తరుణ్ అజయ్ ప్రక్కనే కూర్చుంటూ.

"ఒరే తరుణ్, నా బ్రతుకు ఘోరమ్యాటిక్‌గా తయారయిందిరా. ఇక నన్ను ఆ దేవుడే కాపాడాలి" అన్నాడు భారంగా.

"అసలు విషయం చెప్పకుండా ఈ సోదేమిటిరా?" అన్నాడు తరుణ్, వీడికి ఏమయిందబ్బా అనుకుంటూ.

"షర్టు చింపుకుంటే ప్యాంటుమీద పడుతుంది. నాకెవరో చేతబడి చేసారు. ఇక రోజులు దగ్గర పడినట్టే" అంటూ గాఢంగా నిట్టూర్చాడు అజయ్.

"ఈ దిక్కుమాలిన మాటలు ఆపకపోతే, నేనే మంచిరోజుచూసి, మనుషుల్ని పెట్టి నిన్ను మర్డర్ చేయిస్తా" కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు తరుణ్.

"అదికాదురా... నా కళ్లను చూడు. కోన్ఐస్ క్రీమ్ మీద చెర్రి ఫ్రూట్‌లా ఎలా పైకి పొడుచుకువచ్చాయో... అవి ఏ నిమిషంలో అయినా టప్పున పేలిపోయేలా వున్నాయి. ఇక ఏ ఆలోచనతో, ఆశతో బ్రతకగలను చెప్పు" అడిగాడు

డా॥ ప్రసాద్ కల్లూరి




# కనువిప్పు

అజయ్ దిగాలుగా.

అప్పటికిగానీ పరిస్థితి అర్థంకాలేదు తరుణ్‌కి. కొంచెం ఆలోచించి, "సరే ఒక పనిచెయ్. వెంటనే రెడీఅయి నాతో బయలుదేరు" అన్నాడు. ఎక్కడికి అని అడిగాడు అజయ్. ముందు బయలుదేరమని తొందరపెట్టడంతో తప్పలేదు. అది బెంజిసర్కిల్ దగ్గరున్న కంటి ఆసుపత్రి.

విజిటర్స్ లాంజ్‌లో అజయ్‌ని కూర్చుండ

బెట్టి, ముందుగా లోపలికి వెళ్లి డాక్టర్‌తో మాట్లాడివచ్చాడు తరుణ్. అంతలో ఏదో ఫోన్ రావడంతో మళ్లీ వస్తానంటూ పనిమీద వెళ్లిపోయాడు.

అజయ్ కళ్లలో డ్రాప్స్ వేస్తున్న సిస్టర్ చిలిపిగా నవ్వి "మీ కళ్లేంటి సార్ భలే తమాషాగా వున్నాయి. అచ్చు తాటికాయలోంచి పొడుచుకు వచ్చిన తాటిముంజల్లా చక్కగా వున్నాయి" అంటూ కాంప్లిమెంట్ ఇవ్వడంతో అతనికి చిర్రెత్తుకొచ్చింది. కానీ, ఏమీ చేయలేని పరిస్థితి.

గంట గడిచింది.

ఆప్థాల్మాస్కోపుతో అజయ్ కండ్లను పరీక్ష చేసిన డాక్టర్ కూడా దాదాపు అటువంటి ఎక్స్‌ప్రెషన్ ఇచ్చాడు.

ఎన్ని రకాలుగా పరీక్షచేసినా ఏమీ అంతుబట్టలేదు. కానీ బేరం వదులుకోవడం ఇష్టం లేక "మిస్టర్ అజయ్, మీరో పనిచెయ్యండి. రైతుబజార్ దగ్గర్లో వున్న డాల్ఫిన్ డయాగ్నోస్టిక్ సెంటర్‌కి వెళ్లి, కిడ్నీస్కాన్ చేయించుకు రండి" అంటూ రిఫరెన్స్ రాసిచ్చాడు.

అంత బాధలోనూ అజయ్‌కి ఓ విషయం అంతుబట్టలేదు.

తనకున్న కంటి సమస్యకు, కిడ్నీ స్కానింగ్‌కీ గల సంబంధం ఏమిటి...?! క్యూరియాసిటీ దాచుకోలేక అదే ప్రశ్న అడిగాడు డాక్టర్‌ని.

"షటప్. డాక్టర్ నువ్వా, నేనా? ముందు చెప్పినట్టు చెయ్యి" అని గద్దించాడు. అప్పటికే ఆలస్యం అవడంతో ఆ కార్యక్రమాన్ని మరుసటి రోజుకు వాయిదా వేసాడు అజయ్..

ఆ రోజు ఆదివారం కావడంతో ఆలస్యంగా నిద్రలేచాడు అజయ్. అతి కష్టంమీద కాలకృత్యాలు ముగించుకుని, టీ తాగాడు.



హైదరాబాద్ శ్రీ త్యాగరాయగానసభలో మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో 'ధ్వనిబ్రహ్మ' చిట్టూరి గోపిచంద్‌ని సత్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్. చిత్రంలో మోహనకృష్ణ, రఘుశ్రీ, డా॥ కె.వి. రంగారావు, సవితానాయుడు, డా॥ ఈడ్పుగంటి పద్మజ, జ్యోత్స్న.

తరువాత ఏంచేద్దాం అనుకుంటూ వుండగా అంతలో వచ్చాడు అతని ఇంటి ఓనరు రంగనాథం. ఉండేది పక్క వీధిలో కావడంతో ప్రతి ఆదివారం వచ్చి బాగోగులు కనుక్కోవడం అతనికి అలవాటు. కుశల ప్రశ్నలు అయ్యాక, అజయ్ ముఖంలోని విచారాన్ని గమనించిన రంగనాథం, అందుకు కారణాన్ని అడిగాడు.

"ఏం చెప్పమంటారండి... నా బ్రతుకు బస్టాండ్ అయిపోయింది. విధి నామీద పగబట్టింది. కళ్లముందు కనిపించేదంతా కటిక చీకటి" తన సహజ ధోరణిలో అన్నాడు అజయ్.

"ఏంటండీ, కొంపదీసి విధి, అంతరంగాలు లాంటి సీరియల్స్ క్రమం తప్పకుండా చూస్తున్నారా...? ఇంత భారంగా డైలాగులు రావడానికి కారణం..." సగంలో ఆగిపోయింది రంగనాథం వాక్యం.

"ఏంటిసార్, ఇంగ్లీషు సినిమా మాస్క్‌లోలా నాకళ్లు పొడుచుకు రావడం మీకు తెలియడం లేదా? కావాలంటే చూడండి" అంటూ క్రింది రెప్పలను బలవంతంగా సాగదీసి మరీ చూపించాడు.

అప్పుడు గమనించాడు రంగనాథం. కొంతవరకూ ఆ విషయం వాస్తవమనిపించింది. ఆయన అడిగిన పిమ్మట తన స్కానింగ్ గురించి చెప్పాడు.

అంతా శ్రద్ధగా విన్న ఆయన "ఆ సంగతి తరువాత చూద్దాంగాని, ముందు మీరు నాతో రండి" అంటూ అరగంటలో బయలుదేరదీసాడు.

ఇద్దరూ రంగనాథం బండిమీద బయలుదేరారు.

అది ఏలూరు రోడ్డులోని రామమందిరం ఏరియా. "ప్రశాంతి క్లినిక్...?!" ఎదురుగా కనబడిన బోర్డుచూసి, విషయం ఏమిటని రంగనాథాన్ని అడిగాడు. కనుసైగతోనే లోపలికి రమ్మని అర్థమైంది.

విజిటర్స్ లాంజ్‌లో కూర్చుని, చుట్టుపక్కల కూర్చున్న పేషెంట్లను గమనించసాగాడు అజయ్.

అంతలో లోపలికి వెళ్లివచ్చాడు రంగనాథం. అతని పేరు వచ్చేసరికి రెండు గంటల దాకా పట్టే అవకాశం వుండటంతో అజయ్‌ని అక్కడే కూర్చోబెట్టి తన పనిచూసుకుని వస్తానని బయటకు వెళ్లిపోయాడు రంగనాథం. ఆఖరికి అజయ్‌ని లోపలికి రమ్మని పిలుపువచ్చింది.

లోపల స్ప్లిట్ ఎ.సి.లోంచి చల్లనిగాలి గదంతా పరుచుకుంటూ ఆహ్లాదాన్ని కలుగజేస్తోంది. మంద్రంగా వినబడుతున్న శాస్త్రీయ సంగీతం, అద్భుతమైన వాతావరణాన్ని సృష్టించింది.

"వెల్‌కమ్ మిస్టర్ అజయ్, ప్లీజ్ టేక్ యువర్ సీట్" అంటూ సాదరంగా ఆహ్వానించాడు డాక్టర్.

వినమ్రంగా ఆయనకు నమస్కారం పెట్టి బల్లకి ఇటువైపు కూర్చున్నాడు అజయ్.

దాదాపు పావుగంటపాటు కేవలం తన వ్యక్తిగత విషయాలు, వృత్తి మొదలైన సాధారణ విషయాలు మాత్రమే ఆయన ఎందుకు అడుగుతున్నాడో అర్థం కాలేదు అజయ్‌కి.

అదంతా తనను ఆ వాతావరణానికి అలవాటుపడేలా చేయడానికి డాక్టర్ చేస్తున్న ప్రయత్నమని తెలియదు.

"మీకు ఈ విధంగా కళ్లు బయటకు పొడుచుకురావడం ఎప్పుడు జరిగింది" అడిగాడు డాక్టర్.

"అదేమో నాకు తెలియదు డాక్టర్. నేను మాత్రం నిన్నటి ఉదయమే దీన్ని గమనించాను.

అప్పటికీ కంటి డాక్టర్‌కి చూపించుకున్నాను. ఆయనేమో కిడ్నీ స్కానింగ్ చేయించమన్నారు.

నిజం చెప్పండి డాక్టర్. అసలు నాకు నయమవుతుందంటారా? అంటూ దీనంగా అడుగుతున్న అజయ్‌వైపు జాలిగా చూశాడు డాక్టర్.

"అలా అధైర్యపడితే ఎలా?! అంతా నేను చూసుకుంటాను. మీకేం పరవాలేదు" అని ధైర్యం చెప్పాడు.

నీరసంగా తల ఊపాడు అజయ్. అరగంట అన్నిరకాలా ప్రశ్నలు వేసిన మీదట, తళుక్కున ఓ ఐడియా డాక్టర్ మదిలో ఫ్లాష్ అయింది.

"బైదిబై అజయ్, మీకు పెళ్లయిందా?" అడిగాడు. ఆ ప్రశ్న అసందర్భమని అనిపించినా, కాలేదని సమాధానమిచ్చాడు.

"మీ తీరిక సమయాల్లో ఏం చేస్తుంటారు" అడిగాడు డాక్టర్.

"శని, ఆదివారాలు సెలవలు. ఆ రెండు రోజులూ నవలలు చదవడం, సీడీలు చూడటం అలవాటు" అన్నాడు అజయ్.

"మీకు ఎటువంటి నవలలు అంటే ఇష్టం" వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నించాడు డాక్టర్.

తను చదివే కొన్ని ఇంగ్లీష్ నవలల టైటిల్స్ చెప్పాడు అజయ్. అప్పటికి అజయ్ సమస్య సగం అర్థమైంది డాక్టర్‌కి.

"మరి మీరు చూసే సీడీలు ఎటువంటివి?" కొనసాగించాడు డాక్టర్. సమాధానం చెప్పడానికి కొంచెం ఇబ్బంది పడ్డాడు అజయ్.

"చూడండి... నేనొక డాక్టర్‌ని. మీరు అన్ని వివరాలూ దాచకుండా చెబితేనే తగిన వైద్యం చేయగలుగుతాను. ఆ తరువాత మీ ఇష్టం" అన్నాడు కొంత సీరియస్‌గా.

ఇక దాచి లాభంలేదు అనుకుని లిస్ట్ చెప్పాడు అజయ్, అవి కలిగులా, షోగర్ల్స్ వంటి పోర్నోసీడీలు.

అప్పటికి సమస్య ఎనభైశాతం తేటతెల్లమైంది.

చివరిగా అడిగాడు డాక్టర్ "మిస్టర్ అజయ్, మీరు సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పర్ట్ కదా, వెబ్‌సైట్ ఏదైనా బ్రౌజ్ చేస్తారా ఖాళీగా వున్నప్పుడు"


ఇక దాచడం అనవసరమనుకొని బయట పెట్టాడు అజయ్. అవన్నీ పలు దేశాలలో నిషేధించబడిన పోర్నో సైట్లు.

అప్పుడిక అజయ్ సమస్యకు కారణం పూర్తిగా అర్థం కావడంతో, అతడిని కౌన్సిల్ చేయడానికి పూనుకున్నాడు డాక్టర్.

"మిస్టర్ అజయ్, ఒక సైకియాట్రిస్ట్‌గా నా పాతిక సంవత్సరాల అనుభవంలో మీదొక టిపికల్‌కేస్. మంచి ఉద్యోగంవున్న మీరు వృత్తి పరంగానూ, ఆర్థిక పరంగానూ పూర్తి సంతృప్తిని కలిగివున్నారు. కాకపోతే కాలక్షేపానికి మీరు ఎంచుకున్న మార్గాలే మీ ప్రస్తుత సమస్యకు కారణం.

ఎన్నో రకాల వ్యక్తిత్వ వికాసానికి చెందిన పుస్తకాలు మార్కెట్‌లో లభ్యమవుతుండగా, కేవలం రెచ్చగొట్టే రచనలను మీరు చదువుతున్నారు. దానికితోడు మీరు చూస్తున్న సీడీలు, వెబ్‌సైట్లు మిమ్మల్ని ఎంతగా ప్రభావితం చేసాయంటే, అది మీమీద చూపిన విపరీత ఉద్రేక పూరిత ప్రభావం చివరకు మీ కనుగ్రుడ్లు ముందుకు పొడుచుకు వచ్చేలా చేసింది.

వయసు పరంగా మీలో కోరికలు కలగడం




నేరమని నేను చెప్పడంలేదు. జీవితంలో చక్కగా స్థిరపడిన మీరు లక్షణంగా వివాహం చేసుకుని, ఆనందించండి. అంతేగాని, ఇటువంటి ఆలోచనలను పెంపొందించుకోకండి. ఇలాగే కొంతకాలం కొనసాగితే, నిగ్రహం కోల్పోయిన మీరు తప్పటడుగు వేసే ప్రమాదముంది.

ఇక్కడ మరో విషయం గమనించాలి. మానసిక పరిపక్వత కలిగిన మీలాంటివారు మారడం పెద్ద కష్టం కాదు కానీ, యుక్త వయస్సులోవున్న ఎందరో పిల్లలు నెట్‌సెంటర్లలో ఇలాంటి సైట్స్‌ని బ్రౌజ్‌చేస్తూ, వాటి ప్రభావానికి లోనై నేరాలు చేస్తున్నారు.

పెద్ద పెద్ద దేశాలైన చైనా లాంటి దేశాలు సైతం చట్టబద్ధంగా ఇలాంటి వెబ్‌సైట్లను నిషేదించగలుగుతున్నాయి. కానీ దురదృష్టంకొద్దీ, మన చట్టాలలోని లోపాలు నేరస్థుల పాలిట వరాలుగా మారుతున్నాయి.

ఏనీవే మిష్టర్ అజయ్, మీలో రానున్న పరివర్తన ఎందరికో స్ఫూర్తిదాయకం కావాలని ఆశిస్తాను" అంటూ ముగించాడు డాక్టర్.

అజయ్ మనస్సులోని ఆందోళన పూర్తిగా మాయమైపోయింది. ఆస్థానంలో ఆలోచన మొదలైంది. అది నిర్మాణాత్మక ఆలోచన. గొంతులో నిజాయితీ ధ్వనిస్తుండగా "డాక్టర్, నేను మీకెంతో ఋణపడి ఉంటాను. ఈరోజు మీరు నాకు ఇచ్చిన సలహా, నా అనుభవాన్ని గురించి తెలుసుకున్న ఎందరికో స్ఫూర్తిదాయకం అవుతుంది. అనవసరపు ఆకర్షణలకు లోనుకాకుండా, జీవితాన్ని చక్కని దిశలో పయనించేలా చేసుకోవడానికి దోహదపడుతుంది. థ్యాంక్యూ డాక్టర్, గుడ్‌డే" అంటూ కరచాలనం చేసి బయటకు నడిచాడు అజయ్.

అతని వైపు అభినందపూర్వకంగా చూశాడు డాక్టర్.